క్లుప్తంగా

'గోరుముద్ద' తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం : మండలంలోని టపాయిండ్లు ప్రాథమిక పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంఈఓ కృష్ణయ్య సోమవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

ఓజిలి: అయోధ్యలో బాలరాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మానమాల గ్రామంలోని బాబా మందిరంలో సాయినాథునికి విశేష పూజలు నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆయోధ్య శ్రీరాముని జన్మ వృత్తాంతాన్ని వివరించారు. రాత్రి భజనలతో వైభవంగా పల్లకిసేవ చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రీడాసామగ్రి పంపిణీ



క్రీడాసామగ్రి అందిస్తున్న ఎంపీడీఓ

సైదాపురం : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. ఎంపీడీఓ మీసా ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు శరీర దృఢత్వం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఓ పురుషోత్తం శివకుమార్, పీడీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ట



సైదాపురం : మండలంలోని పాలూరు రాజు పాళెంలో శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

10న మండలస్థాయి క్రికెట్ పోటీలు



సమావేశంలో సభ్యులు

చిల్లకూరు : మండలంలోని చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం సీనియర్ క్రికెటర్ల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న క్రికెట్ టోర్నీపై చర్చించారు. వారు మాట్లాడుతూ మండలంలోని మొత్తం 11 జట్లు పోటీల్లో పాల్గొంటాయని, విజేతలకు ప్రైజ్‌మనీ ఇస్తామని వెల్లడించారు. సమావేశంలో చేవూరు నాగరాజు, నెల్లిపూడి సుబ్రమణ్యం, ఆలకుంట సుబ్రమణ్యం, ఇస్మాయిల్, శేషురెడ్డి, చిరంజీవి, పరశురాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న కులగణన



సర్వే చేస్తున్న వలంటీర్

సైదాపురం : మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నాలుగో రోజూ కులగణన సర్వే ముమ్మరంగా సాగింది. వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 75 శాతానికి పైగా సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. గణన ద్వారా ప్రజల ఆర్థిక స్థితిగతులు తెలుసుకునే వెసులుబాటు ఉంటుందని వెల్లడించారు. ఇందుకోసం ఎలాంటి పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

పెరిగిన నిమ్మ ధర



సైదాపురం : నిమ్మకాయల ధర మూడు రోజులుగా ఊపందుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యతను బట్టి కిలో నిమ్మ రూ.30 నుంచి రూ.45 వరకు పలుకుతోంది. లూజు (బస్తా)రూ.2,400 నుంచి రూ.3,500 వరకు అమ్ముడవుతోంది.

నీలమేఘశ్యామునికి నీరాజనం

పట్టణాలు.. పల్లెలు సర్వం రామమయంగా మారిపోయాయి.. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని జైశ్రీరామ్ నినాదాలతో ఊళ్లు మార్మోగాయి.. ఆధ్యాత్మిక భావనతో కులమత రహితంగా చేపట్టిన శోభాయాత్రలు కనువిందు చేశాయి.. రామ నామ స్మరణతో భక్తజనుల హృదయాలు పులకించాయి.. నీలమేఘశ్యాముని దివ్యచరితను జపిస్తూ పునీతమయ్యాయి.. అరవింద దళయతాక్షుని మహిమాన్విత తేజస్సును జ్ఞప్తికి తెచ్చుకుని పరవశించాయి.

- రామనామ స్మరణతో మార్మోగిన ఊళ్లు
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- శోభాయాత్రలు.. ర్యాలీలు నిర్వహించిన భక్తులు



పెనుబర్తిలోని రామమందిరంలో విశేషాలంకరణలో సీతారామలక్ష్మణులు



విన్నమాలలో నిర్వహించిన అఖండ జ్యోతి పూజోత్సవంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

గూడూరురూరల్ : అయోధ్య రామాలయంలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేసిన సమయంలో జైశ్రీరామ్ నినాదాలతో గూడూరు పట్టణం, పరిసర ప్రాంతాలు మార్మోగాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో శ్రీరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష తులసీ అర్చన, వేద పారాయణం చేపట్టారు. అలాగే బాలాజీ నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట జై శ్రీరామ్ అక్షర మాలను తీర్చిదిద్దారు. హీరాబిన్ మాతాజీ గ్లోబల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కంకణాల పెంచలనాయుడు చేతులమీదుగా పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. గాంధీబొమ్మ వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు. రాజావీధిలోని రామమందిరం వద్ద అన్నదానం చేపట్టారు. గమ్మళ్లపాళెంలో పాండురంగ స్వామి ఆలయం వద్ద శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. పటేల్‌వీధిలోని సాయి సత్సంఘ నిలయంలో శ్రీరామచంద్రుల ఉత్సవ మూర్తులకు విశేష పూజలు చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కోట సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. తిలక్‌నగర్‌లోని సీతారామాంజనేయ క్షేత్రంలో దేవదేవేరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన కీర్తనలు

కోట : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కోటలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.శ్రీరామభక్త బృందం, విశ్వహిందూ పరిషత్ వారు శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం వద్ద భజనలు చేశారు. పురవీధుల్లో రామనామ కీర్తనలు ఆలపిస్తూ శోభాయాత్ర నిర్వహించారు.అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో విశ్వనాథం, వాసు, పద్మావతి, రమేష్‌బాబు, చేవూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.



గూడూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పులకించిన పల్లెలు

వాకాడు : మండలంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి పాళెం పట్టాభిరామాలయం, తూపిలిపాళెం, అంజలాపురం, వైట్‌కుప్పం, శ్రీనివాపురం గ్రామాల్లోని రామమందిరాల్లో భక్తులు పూజలు చేశారు. అలాగే సమరసత సేవా ఫౌండేషన్ సంస్థ సభ్యులు పలు చోట్ల సంకీర్తనలు నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యకార కాపులు మహీంద్ర, గోవిందయ్య, సుబ్రమణ్యం, ఆలయ ధర్మకర్త కె.దామోదర్‌రెడ్డి, అర్చకుడు డి.అనంతాచార్యులు, శ్రీనివాసులురెడ్డి, ఎస్ఎస్ఎఫ్ సంస్థ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథ్, కొండయ్య, కృష్ణయ్య, అంకయ్య, వెంకీ, రమేష్ పాల్గొన్నారు.

భజనలు.. ర్యాలీలు

చిల్లకూరు : మండలంలోని వైష్ణవ ఆలయాలు, రామ మందిరాలలో ప్రత్యేక భజనలు చేపట్టారు. ఈ క్రమంలోనే తమ్మినపట్నం, బల్లవోలు, తిక్కవరం, కడివేడు, చిల్లకూరు గ్రామాల్లో ర్యాలీలు, అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో మారంరెడ్డి అమరనాథరెడ్డి, ఆవుల ప్రభాకర్, దువ్వూరు మునిరెడ్డి, కందలూరు మదన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విశేష పూజలు

రాపూరు : మండలంలోని పలు రామాలయాల్లో భక్తులు విశేష పూజలు, భజనలు నిర్వహించారు. పెనుబర్తిలోని రామమందిరంలో వైఎస్సార్‌సీపీ నేత లీలామోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో హోమం జరిపించారు. వేదపండితులు అయోధ్య అక్షింతలతో భక్తులను ఆశీర్వదించారు..అనంతరం అన్నదానం చేపట్టారు.

ఎమ్మెల్యే కిలివేటి ఆధ్వర్యంలో

నాయుడుపేట: మండలంలోని విన్నమాల రామాలయంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన పట్టాభిరామ స్వామి దేవాలయంలో అఖండ దీపారాధన చేశారు. అఖండ జ్యోతిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విన్నమాల ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు వెల్లడించారు.

అంతా రామ మయం

వెంకటగిరిరూరల్ : అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వెంకటగిరిలోని రామ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారుపేట కోదండరామస్వామి ఆలయం, పాత బస్టాండ్ వద్ద రామాలయం, జీనుగులవారివీధి, బజారువీధి, తూర్పువీధి, వెలమపాళెం, గొల్లపాళెంలోని శ్రీరామ మందిరాల్లో విశేష పూజలు, భజనలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సీతారాములకు కల్యాణం జరిపించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.

గీతాలాపన

సూళ్లూరుపేట : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న రామాలయం, శ్రీనగర్‌కాలనీ యశోద రెసిడెన్సీలో సీతా సమేత రామ లక్ష్మణ స్వామి వార్ల చిత్రపటాలకు ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు విష్ణు సహస్రనామావళిని పఠించారు. శ్రీరాముని కీర్తిస్తూ గీతాలు ఆలపించారు.



గూడూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



సాయి సత్సంగ నిలయంలో పూజలు చేస్తున్న సునీల్‌కుమార్



కోట : రామనామ కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు



వెంకటగిరి : బంగారుపేట కోదండరామస్వామి ఆలయంలో సీతారాములు కల్యాణం



వెంకటగిరి : భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



చిల్లకూరు: తిక్కవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీరామ భక్తులు



బాలిరెడ్డిపాళెంలో నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి) : పట్టణంలోని మల్లమ్మగుడికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తల్లి మునెమ్మ అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. సోమవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మునెమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

పురుగు మందుల వాడకంపై సలహాలు



పంటను పరిశీలిస్తున్న ఏఓ కవిత

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కోటపోలూరు, ఆబాక, మన్నేముత్తేరి, ఇలుపూరులో రైతులకు పురుగు మందుల వాడకంపై ఏఓ కవిత సోమవారం అవగాహన కల్పించారు. పంటలు పరిశీలించిన తర్వాత ఆమె మాట్లాడుతూ మంచు, పొడి వాతావరణ పరిస్థితి వల్ల దోమపోటు, మెడవిరుపు తెగులు ఆశిస్తున్నట్లు గుర్తించామన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకు రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పచ్చదోమ, బూడిద దోమ తదితర తెగుళ్ల నివారణకు మందులు ఎలా పిచికారీ చేయాలో వివరించారు.

ఇళ్ల నిర్మాణంపై అవగాహన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ అధికారులు

దొరవారిసత్రం : మండలంలోని తనియాలి ఎస్టీ కాలనీలో సోమవారం హౌసింగ్ అధికారులు పర్యటించి ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కాలనీకి పీఎంఏవై కింద 15 గృహాలు మంజూరు చేసిందని, వాటి నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. పనులు మొదలుపెడితే బిల్లుల నగదును త్వరితగతిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. తనియాలి పంచాయతీకి పీఎంఏవై గ్రామీణ పథకం కింద 27 పక్కాగృహాలు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈ దశయ్య, ఏఈ మోహన్‌రావు, సివిల్ సప్లయి డైరెక్టర్ భారతి పాల్గొన్నారు.

కండలేరులో 12.364 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 12.364 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 160 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల నీరు విడుదలచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్ఈబీ సీఐగా రమేష్



గూడూరురూరల్ : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్ఈబీ) సీఐగా ఎం.రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపి సత్కరించారు. సీఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలింపు, గంజాయి, అక్రమ మద్యం విక్రయాలప ఉక్కుపాదం మోపనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరిరూరల్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. సోమవారం 14వ వార్డు సచివాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇప్పటి వరకు వచ్చిన వినతులను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

రాపూరు : రాపూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధి, మెరుగైన సేవలపై ప్రజలు సలహాలు అందించవచ్చని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం 9959225651 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు మండల మీట్

వెంకటగిరిరూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతులపై చర్చించనున్నట్లు వెల్లడించారు. సర్పంచ్‌లు, ఎంపిటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పేదరిక నిర్మూలనకే పథకాలు



మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు : దేశంలో పేదరిక నిర్మూలనకే కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం దిగువచావలి, కానూరు గ్రామాల్లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. దేశంలో 2.7 లక్షలు గ్రామాలను ఎంపిక చేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. పేదరికం లేని దేశంగా తీర్చిదిద్దడమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమన్నారు. గిరిజన, దళిత కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతి ధనలక్ష్మి, ఎంపీడీఓ సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మురళి, ఏపీఎం మునిరాజా, కార్యదర్శి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'విజయదీపిక'తో ఉత్తమ పలితాలు



ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

చిల్లకూరు : పదోతరగతి విద్యార్థులకు అందిస్తున్న విజయదీపిక పుస్తకాన్ని అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీఓ కార్యాలయంలో విజయదీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి గతంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే విజయ దీపిక పుస్తకాల రూపకల్పన జరిగిందన్నారు. అప్పటి నుంచి ఏటా జిల్లా పరిషత్ విజయ దీపికలను అందిస్తున్నారని వెల్లడించారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానం స్ఫూర్తితో నెల్లూరు జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ నేతృత్వంలో ముద్రించిన విజయ దీపికలను విద్యార్థులకు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటసూర్యసాయి, ఎస్ఆర్‌పల్లె హెచ్ఎం విజయలక్ష్మి, వల్లిపేడు సీఆర్‌పీ రమణయ్య పాల్గొన్నారు.

నేడు ఎన్‌జీఓ కాలనీలో 'గడప గడపకు'

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కార్యాలయం సోమవారం తెలిపింది. ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని కోరింది.

ఆదుకోవాలని ఆక్వా రైతుల వినతి

కోట : మిచాంగ్ తుపానుతో నష్టపోయామని, ప్రభుత్వమే ఆదుకోవాలని ఆక్వా రైతులు కోరారు. సోమవారం ఈ మేరకు తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందించారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కోట, చిట్టమూరు, వాకాడు మండలాల్లో సుమారు 500 హెక్టార్లలోని రొయ్యల సాగు పూర్తిగా దెబ్బతిందన్నారు. మోటార్లు, ఏరియేటర్లు, జనరేటర్లు పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.